సాక్షి
కర్నూలు
సోమవారం ı 13 ı మార్చి ı 2023



సుంకేసులకు స్వల్ప ఇన్‌ఫ్లో

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్‌కు ఆదివారం 1,050 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. డ్యాంలో 0.751 టీఎంసీల నీటి నిల్వ ఉండగా కేసీ కాల్వకు 705 క్యూసెక్కుల విడుదల చేశారు.



అలరించిన నృత్య ప్రదర్శన

శ్రీశైలంటెంపుల్: నిత్యకళారాధనలో భాగంగా ఆదివారం శ్రీశైల దేవస్థాన కళావేదికపై విజయవాడకు చెందిన శ్రీనటరాజ నృత్యాలయం వారి నాట్యం భక్తులను అలరించింది.

ఉష్ణోగ్రతలు

కనిష్టం	21.7
గరిష్టం	37.9

న్యూస్‌రీల్

రానున్న రోజుల్లో తేలికపాటి వర్షాలు

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఈ నెల 16 నుంచి 20 వరకు తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం వాతావరణ విభాగం శాస్త్రవేత్త మహదేవయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 13 నుంచి 15వ తేదీ వరకు పొడి వాతావరణం ఉంటుందని పేర్కొన్నారు. మూడు రోజుల పాటు ఉష్ణోగ్రతలు 37 నుంచి 38 డిగ్రీల వరకు నమోదు అయ్యే అవకాశం ఉందని తెలిపారు. వర్షాలు పడే అవకాశం ఉన్నందున కోతకు వచ్చిన మిరప పంటను వెంటనే కోసుకోవాలని సూచించారు.

ఉద్యోగులకు ఏపీజీఎల్‌ఐ క్లెయిమ్స్ చెల్లింపు

కర్నూలు(హాస్పిటల్)/(అగ్రికల్చర్): ఉద్యోగులకు సంబంధించి ఏపీజీఎల్‌ఐ క్లెయిమ్స్ సోమవారం వారి బ్యాంక్ ఖాతాల్లో జమ అవుతాయని ఏపీ గవర్నమెంట్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి అరవపాల్, జిల్లా చైర్మన్ బి. రఘుబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 7వ తేదీన జరిగిన జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశంలో ఈ నెల 31వ తేదీ నాటికి వివిధ కేటగిరీల కింద ఉద్యోగులకు ఇవ్వాల్సిన బకాయిలలో రూ.3వేల కోట్లు చెల్లిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిన విషయం తెలిసిందేనన్నారు. చెప్పిన మాట ప్రకారం ప్రభుత్వం మొదటగా ఏపీజీఎల్‌ఐ క్లెయిమ్స్ చెల్లింపు చేసిందని, దానికి సంబంధించిన మొత్తం ఉద్యోగుల ఖాతాల్లో సోమవారం జమ అవుతుందని తెలిపారు. అలాగే జీపీఎఫ్‌కు సంబంధించి కూడా కొన్ని బిల్లులు క్లియర్ చేసినట్లు ఆర్థిక శాఖ అధికారులు తెలిపారన్నారు. మిగిలిన అన్ని రకాల బిల్లులు కూడా షెడ్యూలు ప్రకారం ఈ నెల 31లోపు చెల్లించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తుండటం సంతోషాన్ని ఇస్తోందని పేర్కొన్నారు.

'స్థానిక' ఓటర్లకు గుర్తింపు కార్డులు

కర్నూలు(అర్బన్): స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఓటర్లుగా ఉన్న జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులకు గుర్తింపు కార్డులను అందించినట్లు జెడ్పీ సీఈఓ జీ నాసరరెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఓటింగ్ సమయంలో ఏమైనా సమస్యలు ఉత్పన్నమైతే స్థానికంగా ఉన్న ఎంపీడీఓలు పరిష్కరిస్తారన్నారు. కర్నూలు, ఆదోని, పత్తికొండ, నంద్యాల, ఆత్మకూరు, డోన్‌లో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఆయా డివిజన్ల పరిధిలోని ఓటర్లు అక్కడకే వెళ్లి తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.

నేటి పోలీసు స్పందన రద్దు

కర్నూలు (టౌన్): జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేసినట్లు జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని సూచించారు. ఈనెల 20న పోలీసు స్పందన కార్యక్రమం యథాతథంగా ఉంటుందని తెలిపారు.



బ్యాలెట్ పేపర్‌ను పరిశీలిస్తున్న దృశ్యం



బస్సులో పోలింగ్ కేంద్రాలకు తరలుతున్న ఎన్నికల సిబ్బంది



బ్యాలెట్ బాక్సును తీసుకెళ్తున్న ఎన్నికల సిబ్బంది

నేడే ఎమ్మెల్సీ పోలింగ్

- ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహణ
- సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు తరలిన ఎన్నికల సిబ్బంది
- 56 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్
- ఓటు వేయాలంటే గుర్తింపు కార్డు చూపాలి
- ఏర్పాట్లను పర్యవేక్షించిన కలెక్టర్, జేసీ



అధికారులకు సూచనలు ఇస్తున్న కలెక్టర్ కోటేశ్వరరావు

కర్నూలు(సెంట్రల్): పశ్చిమ రాయలసీమ పట్టభద్ర, ఉపాధ్యాయ, ఉమ్మడి కర్నూలు జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సోమవారం ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరగనుంది. జిల్లాలో 61,633 మంది పట్టభద్రులు, 5,391 మంది ఉపాధ్యాయులు, 1,178 మంది స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం నుంచి వెన్నపూస రవీంద్రారెడ్డి (వైఎస్సార్‌సీపీ), భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి(టీడీపీ), నగరూరు రామచంద్రారెడ్డి (బీజేపీ), నాగరాజు (పీడీఎఫ్)తోపాటు మొత్తం 49 మంది బరిలో ఉన్నారు. ఉపాధ్యాయ స్థానం నుంచి ప్రస్తుత ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి (పీడీఎఫ్), రామచంద్రారెడ్డి (వైఎస్‌ఆర్‌సీపీ), ఒంటేరు శ్రీనివాసరెడ్డి (టీడీపీ) తోపాటు 12మంది బరిలో నిలిచారు. కర్నూలు స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానానికి వైఎస్సార్‌సీపీ తరఫున డాక్టర్ ఏ మధుసూదన్‌తోపాటు మరో ఇద్దరు స్వతంత్రులు పోటీ పడుతున్నారు.

107 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు

ఎమ్మెల్సీ ఎన్నికలకు జిల్లాలో 107 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిలో పట్టభద్రులకు సంబంధించి 74, ఉపాధ్యాయులకు సంబంధించి 27, స్థానిక సంస్థలకు సంబంధించి 6 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. 57 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మకంగా గుర్తించి వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేశారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి ఒక మైక్రో అబ్జర్వర్‌ను నియమించారు.

ఎన్నికల విధుల్లో 2 వేల మంది సిబ్బంది

పోలింగ్ సజావుగా సాగేందుకు ముగ్గురు డీఎస్పీల పర్యవేక్షణలో 1124 మంది పోలీసు సిబ్బంది విధుల్లో ఉంటారు. అలాగే పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీలకు సంబంధించి 16, స్థానిక సంస్థలకు ఆరు ఫ్లైయింగ్ స్క్వాడ్లను ఏర్పాటు చేశారు. 107 మంది ప్రిసైడింగ్ ఆఫీసర్లు(పీఓలు), 107 మంది ఏపీఓలు, 214 మంది ఓపీఓలు విధుల్లో ఉంటారు. రిజర్వ్‌లో 34 మంది పీఓలు, 34 మంది ఏపీఓలు, 68మంది ఓపీఓలతో పాటు 22 మంది మైక్రో అబ్జర్వర్లు ఉంటారు. మొత్తంగా అన్నిరకాల క్యాడర్లలో దాదాపు 2 వేల మంది అధికారులు ఎన్నికల విధుల్లో పాల్గొంటున్నారు.

ఎమ్మెల్సీ స్థానం పేరు	ఓటర్ల సంఖ్య	పోలింగ్ కేంద్రాల సంఖ్య	బరిలో ఉన్న అభ్యర్థుల సంఖ్య
పట్టభద్రులు	61,633	74	49
ఉపాధ్యాయులు	5,391	27	12
స్థానికసంస్థలు	1178	6	3

పోలింగ్ కేంద్రాల వద్ద ఓటరు స్లిప్పులు

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేయాలంటే ఎన్నికల అధికారులు పంపిణీ చేసిన ఓటరు స్లిప్పుతోపాటు ఏదైనా గుర్తింపు కార్డును చూపాల్సి ఉంది. ఇప్పటికే ఎన్నికల సంఘం ఓటరు స్లిప్పులను పంపిణీ చేసింది. గుర్తింపు కార్డుగా ఆధార్, డ్రైవింగ్ లైసెన్స్, పాన్‌కార్డు, ఇండియన్ పాసుపోర్టు, ఫొటోతో కూడిన ఎంప్లాయీ గుర్తింపు కార్డు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ఇచ్చిన ఆఫీషియల్ ఐడీ కార్డు, టీచర్లు, ఉద్యోగులు పనిచేస్తున్న సంస్థలు జారీ చేసిన సర్వీసు ఐడెంటిటీ కార్డులు, యూనివర్సిటీల ఒరిజినల్ డిగ్రీ లేదా డిప్లమో సర్టిఫికెట్లు, వికలాంగులకు సంబంధించి ప్రభుత్వం జారీ చేసిన వికలత్వ సర్టిఫికెటు, కేంద్ర సోషల్ జస్టిస్ మంత్రిత్వ శాఖ ఇచ్చిన యూనిక్ డిజేబులిటీ కార్డుల్లో ఏదైనా ఒక్కటిచూపించి ఓటు వేసేందుకు వెళ్లాలి. ఓటరు స్లిప్పులు అందని వారికి కేంద్రాల దగ్గరే ఇచ్చేందుకు ఏర్పాట్లు చేశారు.

స్వేచ్ఛాయుత వాతావరణంలో పోలింగ్

పోలింగ్ నిర్వహణ ఎన్నికల సిబ్బంది తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు సామగ్రితో ఆదివారమే తరలి వెళ్లారు. పోలింగ్ ముగిసిన అనంతరం బ్యాలెట్ బాక్సులను తీసుకెళ్లిన రూట్లలోనే పటిష్ట బందోబస్తు మధ్య రిసెప్షన్ సెంటర్లకు చేర్చితే అక్కడి నుంచి స్ట్రాంగ్ రూమ్‌లకు తరలిస్తారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో పోలింగ్ నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ పి.కోటేశ్వరరావు తెలిపారు. జేసీ ఎస్.రామసుందర్‌రెడ్డి, డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావుతో కలసి కర్నూలులోని సిల్వర్ జూబ్లీ డిగ్రీ కాలేజీలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను ఆదివారం ఆయన పరిశీలించారు. పోలింగ్ సామగ్రి తరలింపుపై అధికారులకు పలు సూచనలు ఇచ్చారు.

పొరపాట్లకు తావివ్వొద్దు

కర్నూలు(రాజ్‌విహార్): పొరపాట్లకు తావు లేకుండా పోలింగ్ నిర్వహించాలని అధికారులను కలెక్టర్ కోటేశ్వరరావు ఆదేశించారు. ఆదివారం సాయంత్రం ఆయన నోడల్ అధికారులు, ఆర్‌డీఓలు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఉదయం 8గంటలకు పోలింగ్ ప్రక్రియను కచ్చితంగా ప్రారంభించాలన్నారు. సాయంత్రం 4గంటల వరకు సిబ్బంది అంతా విధుల్లో ఉండాలన్నారు. ప్రతి పోలింగ్ లోకేషన్‌లో మెడికల్ క్యాంప్‌ను ఏర్పాటు చేయాలని డీఎంఅండ్ హెచ్‌ఓను ఆదేశించారు.

కంట్రోల్ రూం ప్రారంభం

కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో కంట్రోల్ రూంను ఆదివారం సాయంత్రం కలెక్టర్ కోటేశ్వరరావు ప్రారంభించారు. 107 పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ ప్రక్రియను ఎప్పటికప్పుడు పరిశీలించేందుకు దీనిని ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు.



భక్తజనం మధ్య సాగుతున్న బంగారు రథయాత్ర

కనుల పండువగా మధ్యారాధన

మంత్రాలయం: శ్రీమఠం పూర్వపు పీఠాధిపతి, మంత్రాలయ నవ నిర్మాణ శిల్పి సుయతీంద్రతీర్థుల మధ్యారాధన వేడుకలు ఆదివారం కనులపండువగా జరిగాయి. పీఠాధిపతి సుబుదేంద్రతీర్థుల నేతృత్వంలో వేడుకలు శాస్త్రోక్తంగా చేపట్టారు. ముందుగా సుయతీంద్రతీర్థుల మూల బృందావనానికి నిర్మల్య విసర్జన, విశేష పంచామృతాభిషేకం చేసి మహా మంగళహారతులు పట్టారు. అనంతరం ఊంజల మంటపంలో గురుసార్వ భౌమ సంస్కృత విద్యాపీఠం విద్యార్థులచే యజుర్వేద పారాయణ మంగళ కార్యక్రమం నిర్వహించారు. శ్రీమఠం ప్రాకార వీధుల్లో బంగారు రథంపై సుయతీంద్రతీర్థుల చిత్రపటాన్ని అంగరంగ వైభవంగా ఊరేగించారు. మహిళా భక్తుల గేయాలాపనలు, హరిదాసుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

ప్రజా సంక్షేమమే వైఎస్సార్‌సీపీ లక్ష్యం

- పార్టీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు బీవై రామయ్య
- ఘనంగా వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం



కర్నూలులోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న జిల్లా అధ్యక్షుడు బీవై రామయ్య, చిత్రంలో పార్టీ నాయకులు

కర్నూలు(రాజ్‌విహార్): ప్రజా సంక్షేమమే వైఎస్సార్‌సీపీ లక్ష్యమని ఆ పార్టీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు బీవై రామయ్య అన్నారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆదివారం కర్నూలులో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో వేడుక నిర్వహించారు. వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి నాయకులకు, కార్యకర్తలకు పంచి పెట్టారు. ఈ సందర్భంగా రామయ్య మాట్లాడుతూ అనతి కాలంలోనే అత్యంత ప్రజాదరణ పొందిన పార్టీగా వైఎస్సార్‌సీపీ చరిత్ర సృష్టించిందన్నారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా హామీలు అమలు చేసిన ఘనత సీఎం జగన్‌దే అన్నారు. కర్నూలు మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజల కోసం నిలబడిన ఏకైక పార్టీ వైఎస్సార్‌సీపీ అన్నారు. మహిళావిభాగం జోనల్ ఇన్‌చార్జ్ శ్వేతారెడ్డి మాట్లాడుతూ మహిళల రక్షణ కోసం దిశ చట్టం,పోలీసు స్టేషన్లు తెచ్చి భద్రత కల్పిస్తున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మల్కిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, మహేశ్వరరెడ్డి, భరత్‌కుమార్ రెడ్డి, సుభాష్‌చంద్రబోస్, మద్దయ్య, సత్యం యాదవ్, ధనుంజయ ఆచారి, కటారి సురేష్, ప్రశాంత్, షరీఫ్, లక్ష్మీకాంతయ్య తదితరులు పాల్గొన్నారు.

ఊరూవాడా వేడుక

పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ప్రజా ప్రతినిధులు, పార్టీ నేతలు మహానేత వైఎస్సార్ విగ్రహాలు, చిత్ర పటాలకు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యకర్తలతో కలిసి కేక్‌లు కట్ చేసి పంచి పెట్టారు. కర్నూలు ఎమ్మెల్యే ఎంఏ హఫీజ్‌ఖాన్ ఆధ్వర్యంలో నగరంలోని రాయల్ ఫంక్షన్ హాలులో వేడుక నిర్వహించారు. పత్తికొండ పట్టణంలో వైఎస్సార్ చిత్ర పటానికి ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి పాలాభిషేకం చేశారు. కర్నూలు లోని స్టాంటన్‌పురం కార్యాలయంలో కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. ఎమ్మిగనూరు, ఆదోని, మంత్రాలయం నియోజకవర్గాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు వేడుకల్లో పాల్గొన్నారు.

పార్టీలో కష్టపడేవారికి గుర్తింపు

- మంత్రి గుమ్మనూరు జయరాం



వైఎస్సార్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న మంత్రి గుమ్మనూరు జయరాం, చిత్రంలో పార్టీ నాయకులు

ఆలూరు: వైఎస్సార్‌సీపీలో కష్టపడి పని చేసిన వారికి తప్పని సరిగా గుర్తింపు లభిస్తుందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం అన్నారు. ఆదివారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మండల కన్వీనర్ వీరేష్ ఆధ్వర్యంలో పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను మంత్రి ఆవిష్కరించారు. దివంగత నేత వైఎస్సార్ చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించి..కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీని అణగదొక్కడానికి ప్రతిపక్ష పార్టీలు ఎన్నో కుట్రలు, కుతంత్రాలు చేశాయన్నారు. వాటిన్నంటినీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎదుర్కొంటూ పార్టీని అధికారంలోకి తీసుకొచ్చారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు గుమ్మనూరు నారాయణ స్వామి, శ్రీనివాసులు, జెడ్పీటీసీ ఏరూరు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఈ పాపం ఎవరిది?

- పులి కూనల పునరేకీకరణ వైఫల్యాలకు కారణాలు ఎన్నో
- జూపార్క్ ఎన్‌క్లోజర్‌లో సహజ ఎదుగుదలపై ప్రభావం
- వేటపై పులి పిల్లలకు శిక్షణ సాధ్యమేనా?



పులి కూనలను జూకు తరలిస్తున్న వైద్యులు (ఫైల్)



నల్లమల అడవిలో తల్లి పులి ఆచూకీ కోసం వెతుకుతున్న అటవీ అధికారులు (ఫైల్)

ఆత్మకూరు రూరల్: కర్ణుడి చావుకు వంద కారణాలన్నట్లుగా నల్లమలలో తల్లి పులి నుంచి తప్పిపోయిన కూనలను తిరిగి తల్లి వద్దకు చేర్చే ప్రక్రియ విఫలం కావడానికి ఎన్నో కారణాలు కనిపిస్తున్నాయి. తల్లి చాటున సహజంగా వేట నేర్చుకుని నల్లమల అభయారణ్యంలో పంజా విసరాల్సిన పులి కూనలు జూపార్క్ ఎన్‌క్లోజర్లలో శిక్షణ తీసుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. వారం రోజుల క్రితం నల్లమలలో పులి కూనల పునరేకీకరణ యత్నం విఫలమయ్యేందుకు అటవీ అధికారుల అభద్రతాభావమేనని స్పష్టంగా కనిపిస్తోంది. పర్యావరణ పిరమిడ్‌లో అగ్రసూచి అయిన పులి సంరక్షణ అత్యంత కీలకం. ఈ విషయంలో అటవీ శాఖ ఎంతో బాధ్యతాయుతమైన విధి నిర్వహణగా పరిగణిస్తోంది. ఇందులో విఫలమైన అధికారులు పూర్తిగా బాధ్యత వహించాల్సి వస్తోంది. ఈ భయంతోనే పులి కూనలను తల్లి వద్దకు చేర్చడంలో ఎలాంటి రిస్క్ తీసుకోలేదని తెలుస్తోంది. పిల్లలను అందుబాటులో ఉంచి తల్లి చెంతకు చేరేలా చేయాల్సిన అధికారులు అందుకు భిన్నంగా వ్యవహరించారు. ముందు పులిని వెతికి ఆ తరువాత పిల్లలను దాని వద్దకు చేర్చాలనే ప్రమాద రహిత, నింపాది చర్యలకు ప్రాధాన్యత నిచ్చారు. పులి సంరక్షణలో ఎంతో అనుభవమున్న హైదరాబాద్ టైగర్ కన్జర్వేషన్ సొసైటీ (హెటికోస్)సభ్యులు ఈ పద్ధతిపై విమర్శలు చేస్తున్నారు. సుమారు 2 కి.మీ వలయం పరిధిలో తన కూనలతో పెద్దపులి పర్యవేక్షణ చేయగలదు. అయితే కూనలు కొద్దిగా నీరసించి పోవడంతో వాటికేమైనా అవుతుందేమోనన్న భయంతో అధికారులు ప్రమాద రహిత మార్గంలో యత్నించి విఫలమైనట్లు తెలుస్తోంది. తొలిరోజున పెద్ద గుమ్మడాపురం సమీపంలో తల్లి పులి టీ108 గాండ్రింపులు వినపడ్డాయి. అలాగే సమీపంలో పులి పాదముద్రలు కనిపించాయి. సమీపంలోని ముసలిమడుగు గ్రామ సమీపంలో రోడ్డు దాటుతూ పులి కనిపించింది. అక్కడికి పులికూనలను తీసుకు వెళ్లి తల్లి కోసం ప్రయత్నించి ఉంటే తల్లి ఒడి చేరే అవకాశాలు ఎక్కువగా ఉండేది. మీడియా కారణంగా పులి కూనల విషయం వెలుగులోకి రావడం, గుమ్మడాపురం గ్రామస్తులే కాకుండా ఇతర ప్రాంతాల ప్రజలు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. అలాగే కొందరు మీడియా ప్రతినిధులు అటవీ ప్రాంతంలో సంచరించడంతో ఆ అలికిడికి తల్లి పులి ఆ ప్రాంతం నుంచి వెళ్లిపోడంతో కూనలు తిరుపతి జూకు తరలించాల్సి వచ్చిందని చెప్పవచ్చు.

పులి కూనలు పంజా విసిరేదెలా..!

పులి కూనలు ఏకారణంగానైనా జూలో పరాన్నజీవిగా మారితే ఇక అవి కనీసం కోడి పిల్లను కూడా వేటాడే శక్తిని కూడా కోల్పోతాయి. ఎన్‌టీసీఏ మార్గదర్శకాల మేరకు నాలుగు పులి కూనలను తిరుపతి జూకు తరలించారు. అయితే ఇన్-సీటు ఎన్‌క్లోజర్‌లో ఉంచిన పులికూనలు కౌమార దశకు రాగానే అక్కడ సహజ ఆవరణలోనే వాటికి వేట నేర్పి ఆపై అడవిలో వదిలేస్తామని అధికారులు చెబుతున్నారు. అయితే వేటపై శిక్షణ సాధ్యమేనా అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఒక వేళ అలా ప్రయత్నించినా అడవుల్లో అత్యంత వేగంగా పరిగెత్తి గడ్డితినే వన్య ప్రాణులను జూ పోషిత పులులు వేటాడలేక ఆహారం కోసం సమీప గ్రామాల్లోకి వచ్చే ప్రమాదం ఉంటుందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

పెద్దపులికి ఘ్రాణ శక్తి అపారం

పెద్దపులికి వాసనను గుర్తించే శక్తి అమోఘం. ఒక రకంగా పులి వాసనలను గుర్తించడం ద్వారా తన వేట, తన రక్షణను మొత్తం మీద జీవన విధానాన్నే రూపొందించుకుంటుంది. తన కూనలను వదలి వేటకు వెళ్లినపుడు గరిష్టం రెండు కి.మీ. పరిధి నుంచి కూడా వాటితో సంబంధం కలిగి ఉంటుంది. తనదైన తరంగ ధైర్యంలో శబ్దాలు చేస్తూ కూనలను పర్యవేక్షించగలదు. అందుకే సాధారణంగా కూనలు తల్లి పులితో ఎప్పుడూ తప్పి పోవు. – ఇమ్రాన్ సిద్దిఖి, డైరెక్టర్, హైదరాబాద్ టైగర్ కన్జర్వేషన్ సొసైటీ (హెటికోస్)

క్లుప్తంగా

ముగిసిన చదరంగం పోటీలు



విజేతలకు బహుమతులు అందజేసిన శేషగిరి శెట్టి

కర్నూలు (టౌన్): రెండు రోజులుగా స్థానిక సంకల్బాగ్‌లోని బాష్యం పాఠశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి చదరంగం పోటీలు ఆదివారం సాయంత్రం ముగిసాయి. బాలికల విభాగంలో దండు శాన్విరెడ్డి (ప్రథమ), నిత్యశ్రీ (ద్వితీయ), సరయు (మూడవ స్థానం), బాలుర విభాగంలో విరాట్ (ప్రథమ), హిమతేజ (ద్వితీయ), ఉద్భవ్ (తృతీయ స్థానం)లో నిలిచారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అమరజీవి పొట్టి శ్రీరాములు పవిత్ర స్మృతి పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షులు శేషగిరి శెట్టి తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు



విజేతకు మెడల్, ప్రశంసాపత్రం అందజేస్తున్న సొసైటీ అధ్యక్షులు ఆషీయా

కర్నూలు (టౌన్): క్రీడల్లో రాణిస్తే బాలికలకు మంచి భవిష్యత్తు ఉంటుందని ఎన్‌లైట్ అండ్ ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షులు ఆషీయా అన్నారు. ఆదివారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న జిల్లా స్థాయి విలువిద్య నైపుణ్య శిక్షణ శిబిరం ముగిసింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ కర్నూలు నగరంలో మొట్టమొదటిసారిగా ఇలాంటి నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. నైపుణ్య శిక్షణ అనంతరం పరీక్ష, పోటీలు నిర్వహించి విజేతలను విలు విద్య సంఘం జిల్లా కార్యదర్శి నాగరత్నమయ్య ప్రకటించారు. బాలికల విభాగంలో సోఫియా, నాజియా, ఫిర్దోస్, రజియా, యాస్మిన్, బాలుర విభాగంలో ఫణీంద్ర, భరత్, తేజ, మధులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో లెవల్ వన్ కోచ్ విజయ్ భరద్వాజ్, వంశీకృష్ణ పాల్గొన్నారు.

క్రికెట్ విజేత డెక్కన్ వారియర్స్



ట్రోఫీ అందుకుంటున్న డెక్కన్ వారియర్స్ జట్టు

కర్నూలు (టౌన్): రెండు రోజులుగా స్థానిక జొహరాపురం రోడ్డులో ఉన్న మైపర్ క్రికెట్ మైదానంలో జరుగుతున్న ఫార్మా ప్రీమియర్ క్రికెట్ లీగ్ సీజన్-2 పోటీలు ఆదివారం సాయంత్రం ముగిశాయి. చివరి రోజు ఫైనల్ పోటీల్లో డెక్కన్ వారియర్స్ జట్టు రాకింగ్ స్టార్స్ జట్టుపై విజయం సాధించింది. టాస్ నెగ్గి బ్యాటింగ్ ఎంచుకున్న డెక్కన్ వారియర్స్ జట్టు నిర్ణీత 10 ఓవర్ల 96 పరుగులు చేసింది. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన రాకింగ్ స్టార్స్ జట్టు 10 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 67 పరుగులు చేసి ఓటమి చెందింది. విన్నర్స్, రన్నర్స్ జట్లకు మైపర్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సురేష్ ట్రోఫీలు అందజేశారు. టోర్నమెంటుకు సహకరించిన మైపర్ డైరెక్టర్ డాక్టర్ ఆదిమూలపు సురేష్‌కు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పీడీ హరి నాయక్, సమీర్, మధుకృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా పల్లకీసేవ

కోడుమూరు రూరల్: మండలంలోని గోరంట్ల గ్రామంలో శ్రీలక్ష్మీమాధవస్వామి బ్రహ్మోత్సవాలు కనుల పండువగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామి అమ్మవార్లకు పల్లకీసేవ నిర్వహించారు. ఆలయ పండితులు ముందుగా ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తర్వాత పూలతో అలంకరించిన పల్లకిపై ఆశీనులను చేసి మేళతాళాల మధ్య గ్రామ పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు.

విగ్రహ ప్రతిష్ఠ

పాణ్యం: పాణ్యంలోని శ్రీ సుంకులమ్మ ఆలయం ఎదుట ఆదివారం పోతురాజు విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు నిర్వహించారు. ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి హాజరై పూజలు నిర్వహించారు. మాజీ జెడ్పీటీసీ సభ్యుడు సూర్యనారాయణరెడి పాల్గొన్నారు.

సాక్షి సినిమాలు

ఎస్‌వీసీ కాంప్లెక్స్: పఠాన్, బలగం, తూ జూఠీ మై మక్కర్, 65
వి మెగా ఆనంద్ సినీ కాంప్లెక్స్: సార్, బలగం, 65, మిస్టర్ కల్యాణ్, నేడు విడుదల, దోచేవారెవరురా
వెంకటేష్ సినీ కాంప్లెక్స్: సర్, వినరో భాగ్యము విష్ణు కథ
ఐనాక్స్ : తూ జూఠీ మై మక్కర్, క్రీడ్-3, 65,సీఎస్ఐ సనతాన్,ట్యాక్సీ, స్కీమ్ 6
భరత్ కాంప్లెక్స్ : పులి ది నైన్‌టీన్త్ సెంచరీ, వినరో భాగ్యము విష్ణు కథ
రాజ్ : సీఎస్ఐ సనతాన్
శ్రీరామ : సింహ
విజయ : పులి ది నైన్‌టీన్త్ సెంచరీ

నగరం.. నందనవనం

- పచ్చదనంతో కళకళలాడుతున్న కర్నూలు
- అందంగా రూపుదిద్దుకుంటున్న పార్కులు
- రహదారులకు ఇరువైపుల 75 వేల మొక్కలు







నగరంలో సంస్కృతి, సైన్సు పార్కులను అందంగా తీర్చిదిద్దిన దృశ్యం, పార్కులో ఆటలాడుకుంటున్న చిన్నారులు

కర్నూలు (టౌన్): గత పాలకుల నిర్లక్ష్యం నుంచి కర్నూలు నగరం ఇప్పుడిప్పుడే అభివృద్ధి దిశగా వడివడిగా అడుగులు వేస్తోంది. కనీసం నగరపాలక సంస్థకు ఎన్నికలు నిర్వహించకపోవడం, నిధులు లేమితో సమస్యలు పరిష్కారం కాక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక పరిస్థితి మారింది. నగర పాలక సంస్థకు ఎన్నికలు నిర్వహించి నూతన పాలకవర్గం రావడంతో రెండేళ్ల కాలంలో అభివృద్ధి స్పష్టంగా కనిపిస్తోంది. రహదారుల విస్తరణ, కూడళ్ల ఏర్పాటు, గ్రీనరీకి ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు చెత్త రహిత నగరంగా తీర్చిదిద్దుతున్నారు. ఆదేవిధంగా నగరపాలక సంస్థకు చెందిన ఖాళీ స్థలాలను ఆనందం, ఆహ్లాదం పంచే నందనవనాలుగా తీర్చిదిద్దుతున్నారు.

రూ.8 కోట్లతో నగర పార్కులు :
నగర వాసులకు ఉదయం వాకింగ్‌కు, సాయంత్రం ఆహ్లాదం కల్పించే విధంగా పార్కులను అందంగా మార్చాలని నిర్ణయించారు. అందులో భాగంగా 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.8 కోట్లతో పనులు చేపట్టారు. స్థానిక చాణిక్యపురి కాలనీలో కార్బన్ బేస్‌డ్ పార్కును రూ.1.62 కోట్లతో ఏర్పాటు చేశారు. అలాగే ఎస్‌బీఐ కాలనీలో పార్కును రూ.1.71 కోట్లతో, అమ్మ హాస్పిటల్ సమీపంలో రూ.1.87 కోట్లతో సైన్సు పార్కు, డాక్టర్స్ కాలనీలో కల్చరల్ పార్కును రూ.1.89 కోట్లతో అభివృద్ధి చేశారు. అలాగే చిల్డ్రన్స్ పార్కులో రూ.84.08 లక్షలు వెచ్చించి పిల్లలు ఆడుకునే ఆట వస్తువులతో పాటు గ్లో గార్డెన్ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం అక్కడ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఇప్పటికే ఏర్పాటు చేసిన పార్కులకు స్థానిక వాసుల నుంచి మంచి స్పందన రావడంతో నగరపాలక సంస్థ పరిధిలో ఉన్న 136 ఖాళీ స్థలాలను పరిరక్షించడమే కాకుండా పార్కులుగా అభివృద్ధి చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నారు. ప్రతి రోజు ఉదయం వాకింగ్‌తో పాటు సాయంత్రం పెద్ద సంఖ్యలో పిల్లలు, తల్లిదండ్రులు పార్కులకు వస్తున్నారు. ఒక్క సైన్సు పార్కును మినహాయిస్తే ఎలాంటి రుసుం లేకుండా ఈ పార్కులను ప్రజలు వినియోగించుకునే విధంగా నగర పాలక యంత్రాంగం అవకాశం కల్పించింది.

గ్రీనరీకి ప్రాధాన్యత :
నగర వాసులకు ఆహ్లాదం కోసం ఏర్పాటు చేసిన పార్కులతో పాటు నగరాన్ని గ్రీనరీగా తీర్చిదిద్దారు. నగరంలోని ప్రధాన రహదారులు, శివారు కాలనీలలో రోడ్లకు ఇరువైపుల 75 వేల మొక్కలు నాటారు. వాటిని సంరక్షించేందుకు మున్సిపల్ సిబ్బందిని నియమించారు. దీంతో ఇప్పుడు ఎక్కడ చూసిన పచ్చదనం కనిపిస్తోంది. క్లీన్ అండ్ గ్రీన్‌కు ప్రాధాన్యత ఇవ్వడంతో స్వచ్ఛత అవార్డులో రాష్ట్రంలోనే రెండవ స్థానంలో నిలిచింది. రాబోయే రోజుల్లో ప్రజల కోసం మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నట్లు నగరపాలక వర్గాలు వెల్లడించాయి.

ముమ్మరంగా అభివృద్ధి పనులు
నగర మేయర్ బీవై.రామయ్య, నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ ప్రోత్సాహంతో నగరంలో పెద్ద ఎత్తున్న అభివృద్ధి పనులు చేపడుతున్నాం. గతంలో మంచి పార్కులు లేవు. అందువల్ల పార్కుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చాం. కర్నూలు నగరపాలక సంస్థ పరిధిలోని కర్నూలు, పాణ్యం అర్బన్, కోడుమూరు అర్బన్ ప్రాంతాలను కలుపుకొని అభివృద్ధి పనులు ముమ్మరంగా చేపడుతున్నాం.
–శేషసాయి, మున్సిపల్ ఇన్‌చార్జ్ ఎస్‌ఈ

తైక్వాండో పోటీలు ప్రారంభం

కర్నూలు (టౌన్): నగరంలోని స్థానిక యునైటెడ్ క్లబ్ ఇండోర్ స్టేడియంలో జిల్లా స్థాయి తైక్వాండో పోటీలు ఆదివారం ప్రారంభమయ్యాయి. పోటీలను జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు బి.రామాంజనేయులు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించి మాట్లాడారు. తైక్వాండో క్రీడలో రాణిస్తే విద్యా, ఉద్యోగ అవకాశాలు మెండుగా లభిస్తాయన్నారు. కార్యక్రమంలో తైక్వాండో అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

కర్నూలు (టౌన్): కర్నూలు నగరంలో అక్రమంగా లారీలో తరలిస్తున్న ప్రజా పంపిణీ బియ్యాన్ని ఆదివారం విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. సమాచారం మేరకు పందిపాడు నుంచి 230 క్వింటాళ్ల రేషన్ బియ్యంతో వస్తున్న లారీని చెన్నమ్మ సర్కిల్ వద్ద అధికారులు ఆపి సోదాలు చేశారు. రేషన్ బియ్యం స్వాధీనం చేసుకొని, నిందితులు ఈరన్న, దిలీప్‌లను అదుపులోకి తీసుకొని నాలుగవ పట్టణ పోలీసు స్టేషన్‌లో అప్పగించారు. అలాగే లారీ యజమాని ఆలీ, డ్రైవర్ వెంకటేష్‌లపై కేసు నమోదు చేసినట్లు నాలుగవ పట్టణ పోలీసులు తెలిపారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

కల్లూరు: తెలుగు నామ సంవత్సర త్రైత సిద్ధాత యుగాది (ఉగాది) క్యాలెండర్‌ను ఆదివారం పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి తన స్వగృహంలో ఆదివారం ఆవిష్కరించారు. ఎమ్మెల్యే ఉగాది విశిష్టత గురించి వివరించారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక కర్నూలు కమిటీ అధ్యక్షుడు నాగయ్య పాల్గొన్నారు.

విష జ్వరాలపై అప్రమత్తంగా ఉండండి



మాట్లాడుతున్న లైఫ్ హోమియోపతి వైద్యురాలు డాక్టర్ చందన

కర్నూలు (టౌన్): విష జ్వరాల పట్ల మహిళలు అప్రమత్తంగా ఉండాలని లైఫ్ హోమియోపతి వైద్యురాలు డాక్టర్ చందన అన్నారు. ఆదివారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మహిళలకు, యువతులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పోషకాహారం, దీర్ఘకాలిక వ్యాధుల గురించి అవగాహన కల్పించారు.

మహిళలకు క్రీడా పోటీలు :
అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని క్రీడా పోటీలు నిర్వహించారు. విజేతల వివరాలు ఇలా...స్కిప్పింగ్ రోప్ క్రీడలో వెంకటేశ్వరమ్మ (ప్రథమ), ఇంద్రజా (ద్వితీయ), డి.రాధ (తృతీయ), 40 సంవత్సరాల లోపు వయస్సు కలిగిన మహిళలకు నిర్వహించిన స్పీడ్‌వాక్‌లో రామాంజనమ్మ (ప్రథమ) జయమణి (ద్వితీయ), ఇంద్రజ (తృతీయ), 40 సంవత్సరాలు దాటిన విభాగంలో సునీత (ప్రథమ), కిరణ (ద్వితీయ), సుజాత (తృతీయ), టగ్-ఆఫ్-వార్ విన్నర్స్‌గా మంజుల, ప్రశాంతి, సుస్మిత, ఇంద్రజ, రాధ, ప్రమీల, అపర్ణ, భావ్య, రాణిలు గెలుపొందగా.. బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో స్టేడియం సీఈఓ రమణ, చీఫ్ కోచ్ నటరాజరావు సిబ్బంది పాల్గొన్నారు.

సాహితీవేత్తలకు సన్మానం



సాహితీ వేత్తలు శాంతినారాయణ, హెచ్ఆర్కేను సత్కరిస్తున్న దృశ్యం

కర్నూలు కల్చరల్: ప్రముఖ సాహితీ వేత్తలు డాక్టర్ వైఎస్సార్ లైఫ్ టైమ్ అవార్డు గ్రహీత డాక్టర్ శాంతి నారాయణ, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత బండి నారాయణ స్వామి, హెచ్ఆర్కేలను టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య సన్మానించారు. ఆదివారం టీజీవీ కళాక్షేత్రంలో రచయిత శాంతి నారాయణ రచించిన సాధన నవల ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి పలువురు ప్రముఖ కవులు హాజరయ్యారు. కళలు, సాహిత్యం, సంగీతం, నాటకం తదితర రంగాలకు కళాక్షేత్రం చేస్తున్న సేవలను ఈ సందర్భంగా పత్తి ఓబులయ్య వివరించారు. అత్యధికంగా 37 నందులను కైవసం చేసుకున్న కళాకారులను సాహితీ వేత్తలు అభినందించారు. కార్యక్రమంలో రచయితలు నాగేశ్వరాచారి, కెంగార మోహన్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ పేదల పక్షం

- కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్
- ఘనంగా వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం



వైఎస్సార్‌సీపీ 13వ ఆవిర్భావ దినోత్సవంలో కేక్ కట్ చేస్తున్న కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

కర్నూలు (న్యూటౌన్): కులం, మతం, ప్రాంతం, పార్టీలకు అతీతంగా పేద ప్రజలకు అండగా నిలుస్తున్న ఏకైక పార్టీ వైఎస్సార్‌సీపీ అని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ అన్నారు. ఆదివారం స్టాంటన్‌పురంలోని పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ 13వ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తర్వాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసి మాట్లాడారు.

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఏర్పడి 13వ సంవత్సరంలోకి అడుగుపెట్టడం సంతోషకర విషయమన్నారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత ప్రజా సంక్షేమానికి, రాష్ట్రాభివృద్ధికి పెద్దపీట వేశారన్నారు. ఆయన చేస్తున్న మేలు వల్ల గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి వెళ్తున్న నాయకులకు, ప్రజా ప్రతినిధులకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. అంతకు ముందు ఎమ్మెల్యే పార్టీ శ్రేణులతో కలిసి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు రవిశాస్త్రి, వైస్ ఎంపీపీ 2 నెహెమ్యా, జెడ్పీటీసీ ప్రసన్నకుమార్, మాజీ మండల ఉపాధ్యక్షుడు వాసు, జేసీఎస్ కన్వీనర్ తులసిరెడ్డి, స్కూల్ కమిటీ చైర్మన్ యాకోబు, సచివాలయ కన్వీనర్లు గోపాల్, వెంకటేశ్వర్‌రెడ్డి, భాస్కర్, కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంతో పని చేయండి

- విధుల్లో ఒత్తిడికి గురి కావద్దు.. ఆరోగ్యాన్ని కాపాడుకోండి
- విద్యుత్ కర్నూలు సర్కిల్ డే వేడుకల్లో డైరెక్టర్లు



విద్యుత్ సర్కిల్ డే ముగింపు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అధికారులు



హాజరైన అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది

కర్నూలు(రాజ్‌విహార్): విద్యుత్ ఉద్యోగులు ఉత్సాహంతో పని చేస్తూనే సంస్థ లక్ష్యాలను చేరాలని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ డైరెక్టర్లు శివప్రసాద్ రెడ్డి, సుబ్బరాజు, డాక్టర్ శశికళ అన్నారు. స్థానిక విద్యుత్ భవన్ ఆవరణలో జరుగుతున్న కర్నూలు ఆపరేషన్స్ సర్కిల్ డే వేడుకలు ఆదివారం రాత్రి ముగిశాయి. ఈ సందర్భంగా వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడుతూ.. విధుల్లో ఒత్తిడికి గురి కావడంతో అనారోగ్యాల పాలవుతారని చెప్పారు. దీనిని నివారించేందుకు తగిన జాగ్రత్తలు తప్పవన్నారు. విద్యుత్ శాఖలో ఉద్యోగం అంటేనే 24''7 అప్రమత్తంగా ఉండాలని, అంతరాయం, కోతలు, బ్రేక్ డౌన్స్, రైతుల సమస్యలు ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితి అన్నారు. ఇబ్బంది కలిగిన వెంటనే అర్ధరాత్రి అపరాత్రి అని చూడకుండా నేరుగా ఫోన్లు చేసి తమ సమస్యలు చెప్పుకుంటారని వెల్లడించారు. ఇలాంటి సమయాల్లో వెంటనే స్పందించాల్సి ఉన్నా.. కంగారు, ఒత్తిడి, ఆందోళనకు గురి కావాల్సిన అవసరం లేదన్నారు. అనంతరం రిటైర్డు డైరెక్టర్ పి.పుల్లారెడ్డి మాట్లాడుతూ విధి నిర్వహణలో విద్యుత్ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది ఎంతో ఒత్తిడిని ఎదుర్కొంటున్నారని చెప్పారు. సిబ్బందిలో మానసిక ఉల్లాసం నింపేందుకు ఇలాంటి ఆటల పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈ ఎం.ఉమాపతి మాట్లాడుతూ ఉద్యోగుల్లో మానసిక ఉల్లాసాన్ని నింపేందుకే సర్కిల్ డే వేడుక నిర్వహించినట్లు చెప్పారు. క్రీడలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు, ఆట పోటీలతో ప్రశాంతత పొందుతారని వెల్లడించారు. ఇక రోజువారి విధులు సమర్ధవంతంగా నిర్వహిస్తూ వినియోగదారులకు మెరుగైన సేవలందించాలని, దీంతో సంస్థకు కూడా మంచి పేరు వస్తుందన్నారు. అనంతరం వివిధ విభాగాల్లో విజేతలుగా నిలిచిన ఉద్యోగులు, సిబ్బందికి బహుమతులు ప్రదానం చేశారు. సమావేశంలో ట్రాన్స్‌కో ఎస్ఈలు రామకృష్ణ, కృష్ణకుమార్, కమర్షియల్ జీఎం రామచంద్రరావు, స్పోర్ట్స్ కౌన్సిల్ అధ్యక్షుడు రమేష్, విద్యుత్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల పక్షాన నిలిచిన పార్టీ వైఎస్సార్‌సీపీ

- పారదర్శక పాలన అందిస్తున్న సీఎం జగన్
- ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్



వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్, నియోజకర్గ పరిశీలకుడు కర్రా హర్షవర్ధన్‌రెడ్డి తదితరులు

కర్నూలు(రాజ్‌విహార్): ప్రజల పక్షాన నిలిచిన ఏకైక పార్టీ వైఎస్ఆర్‌సీపీ అని కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ అన్నారు. పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆదివారం స్థానిక పార్టీ నగర కార్యాలయంలో వేడుక నిర్వహించారు. ముందుగా దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నాయకులు, కార్యకర్తల మధ్య కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ 2004 నుంచి 2009 వరకు రాష్ట్రంలో సంక్షేమ పాలన నడిచిందన్నారు. ఆ తరువాత వచ్చిన పాలకులు స్వార్థ ప్రయోజనాలు, ప్రజలపై భారాలు వేయడమే లక్ష్యంగా పనిచేశారన్నారు. అయితే పేదల కష్టాలను తొలగించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 13 ఏళ్ల క్రితం వైఎస్ఆర్‌సీపీని ఏర్పాటు చేశారని, నాటి నుంచి నేటి వరకు గొప్ప ఎజెండాతో పనిచేస్తున్నారని కొనియాడారు. అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీలను ఎంతో పారదర్శకంగా అమలు చేస్తూ వస్తున్నారని చెప్పారు. పథకాలను ఎలాంటి రాజకీయాలు చూడకుండా అర్హతే ప్రామానికంగా నేరుగా లబ్ధిదారుల ఖాతాలోకి నగదును జమ చేస్తున్నారని, సీఎం తెచ్చిన పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని తెలిపారు. జనరంజక పాలన సాగిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి మరో 30 ఏళ్లు సీఎంగా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పార్టీ కర్నూలు నియోజకర్గ పరిశీలకుడు కర్రా హర్షవర్ధన్‌రెడ్డి, కార్పొరేటర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

ఎన్‌జీవో అసోసియేషన్ నగరశాఖ ఉపాధ్యక్షురాలిగా సుభాషిణి



సుభాషిణిని అభినందిస్తున్న నాయకులు

కర్నూలు(అగ్రికల్చర్): ఏపీ ఎన్‌జీవో అసోసియేషన్ కర్నూలు నగర శాఖ ఉపాధ్యక్షురాలుగా పి.సుభాషిణి నియమితులయ్యారు. ఆదివారం సాయంత్రం కర్నూలు నగర శాఖ కార్యవర్గ సమావేశం స్థానిక ఎన్‌జీవో హోమ్‌లో అధ్యక్షుడు ఎంసీ కాశన్న ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఖాళీగా ఉన్న ఉపాధ్యక్ష పోస్టులో కల్లూరు మండలం పర్లలో హెల్త్ ఎడ్యుకేటర్‌గా పనిచేస్తున్న సుభాషిణిని కో ఆప్షన్ ద్వారా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దీంతో ఆమెను నగర శాఖ కార్యవర్గ సభ్యులు, జిల్లా నేతలు అభినందించారు. కార్యక్రమంలో జిల్లా శాఖ ఉపాధ్యక్షుడు, జిల్లా వ్యవసాయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రవిప్రకాశ్, కార్యదర్శి పాండురంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్‌కు సర్వం సిద్ధం



ఎన్నికల సామగ్రితో సి.బెళగల్‌కు చేరుకున్న సిబ్బంది



పాణ్యంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రం



బ్యాలెట్ పేపర్లు సరిచూసుకుంటున్న పోలింగ్ సిబ్బంది



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కోడుమూరు సీఐ శ్రీధర్, పోలింగ్ అధికారులు

పాణ్యం: ఎమ్మెల్సీ ఎన్నికలకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. నేడు పట్టభద్రులు, ఉపాధ్యాయ, స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల వద్ద అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. ఆదివారం ఉన్నతాధికారులు కేంద్రాలను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. పాణ్యంలో ఉర్దూ పాఠశాల, గడివేములలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఓర్వకల్లులో ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కల్లూరు మండలంలో కల్లూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలతో పాటు మరో 14 పోలింగ్ కేంద్రాలను ఏర్పాట్లు చేశారు. పాణ్యం నియోజకవర్గంలో మొత్తం 17,262 మంది పట్టభద్రులు, 1898 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉన్నారు. వీరంతా నేడు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. అయితే, పోలింగ్ కేంద్రానికి వచ్చే సమయంలో ఓటర్లు వెంట తప్పనిసరిగా ఏదైనా గుర్తింపు కార్డు తెచ్చుకోవాలి. ఉదయం 8 గంటలకు పోలింగ్ ప్రారంభమవుతుందని, కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని అధికారులు తెలిపారు.

గూడూరు: ఎన్నికల విధుల నిర్వహణకు సిబ్బంది కేంద్రాలకు చేరుకున్నారు. ఆదివారం గూడూరు పట్టణంలో ఏర్పాటు చేసిన రెండు పోలింగ్ కేంద్రాల్లో వారు బాక్స్‌లు, బ్యాలెట్ పేపర్లు సరి చూసుకున్నారు. తహసీల్దార్ శివ రాముడు, కోడుమూరు సీఐ శ్రీధర్ పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు
సి.బెళగల్: ఎమ్మెల్సీ ఎన్నికలకు మండలంలో పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు తహసీలార్ శివశంకర్‌నాయక్ తెలిపారు. స్థానిక జెడ్పీ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని ఆదివారం ఆయన పరిశీలించారు. మండలంలో 960 మంది పట్టభద్రులు, 16 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉన్నారని తెలిపారు. తర్వాత జిల్లా కేంద్రం నుంచి వచ్చిన ఎన్నికల సామగ్రిని ఎన్నికల జోనల్ అధికారి మోహిద్దీన్, తహసీల్దార్ పోలింగ్ కేంద్రంలో భద్రపరిచారు.

ఎన్నికల ఏర్పాట్లు పరిశీలన
కోడుమూరు రూరల్: స్థానిక పోలింగ్ కేంద్రం వద్ద ఏర్పాట్లను కోడుమూరు తహసీల్దార్ శేషఫణి ఆదివారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు సంబంధించి కోడుమూరు బాలికల హైస్కూలులో రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. అలాగే ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి సంబంధించి కోడుమూరు బాలుర హైస్కూల్‌లో ఒక పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి
ఓర్వకల్లు: ఎమ్మెల్సీ ఎన్నికలకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. మండలంలో స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో పట్టభద్రులు, ఉపాధ్యాయ ఓటర్లకు వేర్వేరుగా రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో మహిళలకు, పురుషులకు ప్రత్యేకమైన బూత్‌లను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాల్లో కలిపి 1213 మంది పట్టభద్రులు, 72 మంది ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఆదివారం సాయంత్రం బ్యాలెట్ పేపర్లు, బ్యాలెట్ బాక్స్‌లను తహసీల్దార్ శివప్రసాద్‌రెడ్డి పోలింగ్ కేంద్రాలకు చేర్చారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా 30 మంది పోలీసులతో పోలింగ్ కేంద్రం వద్ద పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ మల్లిఖార్జున తెలిపారు.

ఎన్నికల నియమావళిని పాటించాలి
సి.బెళగల్: ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాజకీయపార్టీ నేతలు ఎన్నికల నియమావళిని పాటించాలని ఎస్ఐ పీరయ్య అన్నారు. ఆదివారం ఆయన పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి పోలీస్ బందోబస్తును పర్యవేక్షించారు. కేంద్రం వద్ద నేడు 144 సెక్షన్ అమలులో ఉంటుందని చెప్పారు. ఓటర్లు వెంట గుర్తింపు కార్డు తెచ్చుకోవాలని సూచించారు.